# విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్ డిమాండ్



**స్టేషన్ ఘన్‌పూర్/, జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)ను పకడ్బందీగా అమలు చేసి, ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ కేంద్రంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత శాఖల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం ఉచిత విద్య కల్పించాల్సి ఉన్నప్పటికీ జిల్లాలో ఏ ఒక్క పాఠశాల కూడా ఈ నిబంధనను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు.విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టి, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మామిడి తోటలో చెలరేగిన మంటలు

## ఆందోళనలో రైతులు





**వర్ధన్నపేట/జూన్ 8(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామంలో సోమవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పోలుసాని దుర్గారావు కుమారులు పోలుసాని అభినయ్ రావు, భరత్ రాజారావులకు చెందిన మామిడి తోటలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు తోటంతా వ్యాపించడంతో విలువైన మామిడి చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. తోటలో మంటలు లేచిన విషయాన్ని గమనించిన తోటి రైతు పోలుసాని నవీన్ రావు వెంటనే స్పందించారు. ఆయన స్థానికులతో కలిసి మంటలను అదుపు చేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అయితే మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో స్థానికుల శ్రమ సరిపోవడం లేదు. చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిదవుతుండటంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేయాలని, తమను నష్టం నుండి కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బయ్యారం సొసైటీలో జీలుగు విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.





**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో రైతులకు హరిత ఎరువు (జీలుగ) విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ జీలుగు విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని,పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడానికి పచ్చిరొట్ట ఎరువుల సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు.అనంతరం బాలాజీపేటలో గ్రామసభలో పాల్గొని రైతులకు పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలు, నకిలీ విత్తనాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పంటల వైవిధ్యీకరణ,యూరియా వినియోగాన్ని తగ్గించడం మరియు నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో దీపిక,పీఏసీఎస్ చైర్మన్,గ్రామ పంచాయతీ సర్పంచులు,వివిధ శాఖల అధికారులు,సొసైటీ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.

## -ఎమ్మెల్యే కోరం కనకయ్య.





**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బయ్యారం మండల కేంద్రంలో అటవీ శాఖ కార్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం నేటి కాలంలో అత్యంత అవసరమన్నారు.వాతావరణ మార్పులు,పెరుగుతున్న కాలుష్య ప్రభావాలను తగ్గించేందుకు పర్యావరణాన్ని ప్రేమించాలి.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ప్రకృతి వనరుల సంరక్షణ,నీటి పొదుపు,ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ,చెట్ల పెంపకం వంటి అంశాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అటవీ శాఖ అధికారులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో రవి కిరణ్,డిఆర్వోలు రవి,సుప్రియ,బిట్ ఆఫీసర్స్ శంకర్, లవణ్ కుమార్,లత,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు,బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెంకు కార్మికుల కనీస వేతనం అమలు చేయాలి.

## -తెలంగాణ రాష్ట్ర టైల్స్ వర్కర్స్ యూనియన్ సమ్మె నోటీస్.



**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లా టైల్స్ వర్కర్స్ కార్మికుల కనీస వేతన చట్టం అమలు చేయాలని వారి డిమాండ్ల నెరవేర్చాలని కోరుతూ అనేక రోజులుగా యాజమాన్యాలతో చర్చలు జరిపినట్లు తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైబాగుల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేకమార్లు యాజమాన్యాలతో శాంతియుతంగా చర్చలు జరిపినట్లు తెలిపారు.యాజమాన్యాలు దిగి రాకపోవడంతో శనివారం నుండి నిరవధికంగా కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు.కార్మికులు తమ కనీస వేతన చట్టం అమలయ్యే వరకు ఎవరు కూడా పనులకు హాజరు కావద్దని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ టైల్స్ వర్కర్స్ నాయకులు సనప పొమ్మయ్య,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ.

## -సీఐ రవీందర్



**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం బాలాజీపేటలో నిర్వహించిన గ్రామసభలో నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గార్ల బయ్యారం సీఐ రవీందర్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ గ్రామస్తులతో చేపించారు.మేమంతా మాదకద్రవ్యాలు ఇతర వ్యసనాలకు దూరంగా ఉంటానని,నా ఆరోగ్యం,కుటుంబం,సమాజం,దేశ అభివృద్ధికి హాని కలిగించే ఏ మాదకద్రవ్యాన్నీ ఉపయోగించనని, మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి అవగాహన పెంపొందించడానికి కృషి చేస్తానని, నా స్నేహితులు,కుటుంబ సభ్యులు కూడా వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహిస్తాను.ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన విలువలతో కూడిన జీవితాన్ని గడపడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని సామూహిక ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,ఎంపిడివో దీపిక,ఏవో రాజు,యస్ఐ ప్రశాంత్ బాబు,సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతంతో ఇద్దరు రైతుల గేదెల మృతి

## రూ.2 లక్షలకుపైగా ఆస్తి నష్టం.. విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



**వైరా, /జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):** వైరా మండల పరిధిలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. మేత కోసం వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందడంతో ఇద్దరు రైతులకు రూ.2 లక్షలకుపైగా ఆర్థిక నష్టం వాటిల్లింది.స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణ్యపురం గ్రామానికి చెందిన వాకదాని రామచంద్రం, వాకదాని వెంకయ్య తమ గేదెలను మేత కోసం తీసుకెళ్లారు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిన ఎత్తులో లేకపోవడం, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో గేదెలకు తగిలాయి. దీంతో విద్యుత్ ప్రవాహానికి గురైన ఆ రెండు గేదెలు విలవిల్లాడుతూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. గేదెల మృతితో రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇటీవలే కొనుగోలు చేసిన ఈ గేదెల విలువ ఒక్కొక్కటి సుమారు రూ.1 లక్ష ఉంటుందని, మొత్తం రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని వారు వాపోయారు.విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు, బాధిత రైతులు ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సరైన ఎత్తులో ఏర్పాటు చేయకపోవడం, తీగలు కిందకు వేలాడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో అమాయక పశువులు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.
మృతి చెందిన గేదెలే తమ జీవనాధారమని, తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో పడతాయని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ వెంటనే స్పందించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక రైతులు కూడా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన భక్తులు





**తల్లాడ/, జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని నూతనకల్లు గ్రామంలోని ఖాసీంషా వలి దర్గా వద్ద సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను సందర్శించిన రాయల రాము, అడపా అనిల్ కుమార్‌లు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, ఖురాన్ వచనాలను శ్రద్ధగా ఆలకించారు. దర్గా ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించారు.
అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రేమ విందును స్వీకరించారు. దర్గా అభివృద్ధి, సహాయ సహకారాల నిమిత్తం షెడ్ నిర్మాణానికి అడపా అనిల్ కుమార్ సుమారు రూ.1 లక్షల ఆర్థిక సహాయాన్ని విరాళంగా ప్రకటించి అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు కూడా తమ వంతు సహాయ సహకారాలు, విరాళాలు అందజేసి కార్యక్రమ విజయానికి తోడ్పడ్డారు. కార్యక్రమంలో నాగుల్ మీరా, ముదిరాజు వీరబాబు, కృష్ణవేణి, కళ్యాణపు వెంకటయ్య, తోట శ్రీకాంత్, వంశీతో పాటు దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అన్నదాన కార్యక్రమం భక్తుల సమిష్టి సహకారంతో విజయవంతంగా ముగిసింది.

అమక్షరం ప్రజల పత్రం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# మృగశిర రోజున చేపలు ఎందుకు తింటారు?

## సంప్రదాయం వెనుక ఆరోగ్య రహస్యం



**తల్లాడ, /జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):**
ప్రకృతి మార్పులకు అనుగుణంగా మన జీవన విధానాన్ని మలుచుకున్న భారతీయ సంస్కృతిలో మృగశిర కార్తెకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజున చేపలు తినడం లేదా చేప ప్రసాదం స్వీకరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయం వెనుక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన శాస్త్రీయ కారణాలు కూడా ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

రోహిణి కార్తె కాలంలో తీవ్రమైన ఎండలతో భూమి వేడెక్కిన తర్వాత మృగశిర కార్తెతో రుతుపవనాలు ప్రవేశించి తొలి వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో వాతావరణంలో ఉష్ణోగ్రత ఒక్కసారిగా తగ్గి తేమ పెరుగుతుంది. దీంతో శరీర రోగనిరోధక శక్తిపై ప్రభావం పడటంతో పాటు జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశాలు అధికమవుతాయి.

ఆయుర్వేదం ప్రకారం ఈ కాలంలో శరీరంలోని వాత, పిత్త, కఫ దోషాల్లో అసమతుల్యత ఏర్పడే అవకాశం ఉంటుంది. చేపలు శరీరానికి అవసరమైన వేడిని అందించి కఫ సంబంధిత సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.వైద్యశాస్త్రం ప్రకారం చేపల్లో అధిక నాణ్యత గల ప్రోటీన్లు, విటమిన్-డి, ఐరన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, శ్వాసకోశ వ్యవస్థ పనితీరును బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఊపిరితిత్తుల వాపును తగ్గించి శ్వాస సమస్యల నుంచి ఉపశమనం కలిగించగలవని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎలాంటి చేపలు తినాలి?

మృగశిర కార్తె రోజున తాజా చేపలను మాత్రమే ఆహారంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. తొలి వర్షాల సమయంలో చెరువులు, నదుల్లో లభించే తాజా చేపలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. నిల్వ ఉంచిన లేదా ఎక్కువ కాలం ఐస్‌లో భద్రపరిచిన చేపలను వీలైనంత వరకు నివారించడం మంచిదని చెబుతున్నారు.చేపలను అధిక నూనెలో వేయించడంకంటే పులుసుగా లేదా తక్కువ నూనెతో వండుకోవడం వల్ల అందులోని పోషక విలువలు మెరుగ్గా శరీరానికి అందుతాయి. అలాగే అల్లం, వెల్లుల్లి, మిరియాలు వంటి మసాలా దినుసులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

అయితే, మృగశిర రోజున చేపలు తింటే ప్రత్యేకంగా అన్ని రోగాలు నివారించబడతాయనే విషయానికి బలమైన వైద్య ఆధారాలు లేవు. కానీ చేపలు సాధారణంగా పోషకాహారంగాఉపయోగకరమైనవని, సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.మన పెద్దలు ప్రకృతి మార్పులకు అనుగుణంగా రూపొందించిన అనేక ఆచారాల మాదిరిగానే మృగశిర కార్తె రోజున చేపలు తినే సంప్రదాయం కూడా ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రజా విజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తోంది.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లుల విడుదల**

**రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్ల మంజూరు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





**కూసుమంచి,/ జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలోని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల మంజూరుతోనే ప్రభుత్వ బాధ్యత ముగియదని, నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.రాజుపేట గ్రామంలో మంజూరైన ఇళ్లలో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహప్రవేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.చివరి అర్హ లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.నూతన గృహాల్లోకి ప్రవేశించిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు కొలువు .. నిత్య నరకం !

దేశంలో నిరుద్యోగిత పెరుగుతున్న కొద్దీ ప్రైవేటు రంగంలో దోపిడీ పరాకాష్టకు చేరుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, బతుకుదెరువు కోసం ప్రైవేటు బాట పడుతున్న లక్షలాది మంది యువత నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. విద్యా సంస్థల నుంచి మొదలుకొని కార్పొరేట్ కంపెనీలు, హోటళ్లు, షాపింగ్ మాళ్ల వరకు ప్రతిచోటా ప్రైవేటు ఉద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది, సంఖ్య పెరుగుతున్నంత వేగంగా వారి హక్కులు, జీవన ప్రమాణాలు మెరుగుపడకపోగా, మరింత దిగజారుతుండటం ఆందోళనకరం. ఉపాధి కల్పిస్తున్నామనే సాకుతో యాజమాన్యాలు కార్మికులను, ఉద్యోగులను ఆధునిక బానిసలుగా మారుస్తున్నాయి.

**శ్రమ దోపిడీ.. చాలీచాలని వేతనాలు**

విద్యాబుద్ధులు నేర్పే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, అక్కడి అధ్యాపకులకు ఇచ్చే వేతనాలు మాత్రం అరకొరే. అటు ఐటీ, కార్పొరేట్ సంస్థల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి పోయి ఆఫీసులకు పిలుస్తున్నాక ఒత్తిడి రెట్టింపయింది. నిలకడ లేని పనిగంటలు, అర్ధరాత్రి దాటినా సాగే లాగిన్లు ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నాయి. హోటళ్లు, షాపింగ్ మాళ్లలోనైతే కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. రోజుకు 12 గంటల పాటు నిలబడే విధులు నిర్వహించాల్సి రావడం, పండుగలు, సెలవు రోజుల్లోనూ విశ్రాంతి లేకపోవడం వారి దైనందిన జీవితాన్ని నరకప్రాయం చేస్తోంది.

### చట్టాలు చుట్టాలైతే ఎలా?
### ప్రధాన సమస్యలు

**కనీస వేతన చట్టాల ఉల్లంఘన:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నామమాత్రపు జీతాలు ఇవ్వడం.

ఉద్యోగ భద్రత శూన్యం: ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని భయాందోళన.

**ఈఎస్ఐ, పీఎఫ్ లీనమవ్వడం**: చట్టబద్ధమైన సౌకర్యాలను సైతం యాజమాన్యాలు ఎగ్గొట్టడం.

ఈ శ్రమ దోపిడీని అరికట్టాల్సిన కార్మిక శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. యాజమాన్యాల ఒత్తిళ్లకు లొంగి తనిఖీలను నామమాత్రం చేయడంతో ప్రైవేటు సంస్థల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

**తక్షణ చర్యలు అవసరం:**

ఇకనైనా ప్రభుత్వం ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రతి ప్రైవేటు సంస్థలో కనీస వేతన చట్టం అమలు జరిగేలా చూడాలి. పనిగంటలను క్రమబద్ధీకరించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, మానసిక ఒత్తిడిని తగ్గించేలా కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలి. లక్షలాది మంది శ్రమపై నడుస్తున్న ఈ ఆర్థిక వ్యవస్థలో, ఆ శ్రామికుడి శ్రేయస్సును నిర్లక్ష్యం చేస్తే లాభాల సామ్రాజ్యాలు ఎంతోకాలం నిలబడలేవని యాజమాన్యాలు, పాలకులు గుర్తించాలి.



సీనియర్ జర్నలిస్ట్ బర్రు కరుణాకర్

# ప్రజా సమస్యల పరిస్కారం కోసమే గ్రామసభ.

**-సర్పంచ్ గుగులోత్ ప్రేమలతసేవాలాల్.**



**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** ప్రజా సమస్యల పరిస్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని నర్సాతండా గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రేమలతసేవాలాల్ తెలిపారు.ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ముగింపు గ్రామసభను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అఖిల్ హాజరై మాట్లాడారు రానున్న వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ద్రవ,ఘన వ్యర్థాల నిర్వహణ,జల సంరక్షణ, పారిశుధ్యం,ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శి హనుమంతు,ఉపసర్పంచ్ కైక,వార్డు సభ్యులు,సాయి కుమార్,విజయ,సాల్కి,రమేష్,కవిత, ఉపాధ్యాయులు,అంగన్వాడీ సిబ్బంది,ఆశ వర్కర్స్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సింగారంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన.



**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో జిల్లా ఎస్పి శబరిష ఆదేశానుసరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాజాత ప్రదర్శన కార్యక్రమంలో మూఢనమ్మకాలు, మహిళలపై అత్యాచారాలు, వేదింపులు, డయల్ 100 తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు మాట్లాడుతూ సైబర్ నేరాలు,ఈవీజింగ్, గంజాయి,ఆన్లైన్ గేమింగ్, సీసీకెమెరాల ప్రాధాన్యత,వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మహిళలు చిన్నారుల రక్షణ సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు.మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి సమాచారం ఇస్తే 5 వేలు పారితోషకం ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్,కళాజాత బృందం సభ్యులు వృథ్వీరాజ్,సతీష్, తిరుపతి,పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి,సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరం.

**-ఎమ్మెల్యే కోరం కనకయ్య.**



**బయ్యారం/,జూన్ 8.(జర్నలిస్ట్ వార్త)**కల్యాణ లక్ష్మి,సీఎం సహాయ నిధి చెక్కులు నిరుపేదల పాలిట వరంలాంటివని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.బయ్యారం మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.అలాగే అనారోగ్యం,ప్రమాదాలు,ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం చేయూతనిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో దీపిక,సొసైటీ చైర్మన్,సొసైటీ డైరెక్టర్స్,సీనియర్ అసిస్టెంట్ వెంకన్న,ఆర్ఐలు ఉపేందర్,సందీప్,జిపివోలు ప్రభాకర్,భాస్కర్,ఉమేష్,శ్వేతా,శిరీష, పాండయ్య,సర్పంచులు,రైతులు,లబ్ధిదారులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 10న వర్ధన్నపేటలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

**వర్ధన్నపేట/జూన్ 8 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 10వ తేదీన ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. వర్ధన్నపేట ఏడీఈ కార్యాలయ ఆవరణలో టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ లోకల్ కోర్టు/సదస్సు జరగనుంది. ఈ మేరకు వర్ధన్నపేట సబ్ డివిజన్ ఏడీఈ నటరాజ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ శ్రీ ఎన్.వి. వేణుగోపాల చారి, ఫోరం సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఆ రోజు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు వినియోగదారుల నుంచి వారు స్వయంగా ఫిర్యాదులను స్వీకరిస్తారు.ముఖ్యంగా తప్పుడు విద్యుత్ బిల్లులు రావడం, రీడింగ్ కంటే అదనంగా బిల్లులు రావడం వంటి సమస్యలను ఇక్కడ పరిష్కరిస్తారు. అలాగే విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. వీటితో పాటు లోపాలున్న మీటర్ల మార్పిడి, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ అంశాలను పరిశీలిస్తారు. సర్వీసు పేరు మార్పు, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు లాంటి ఇతర సాంకేతిక సమస్యలకు కూడా ఈ సదస్సులో తక్షణ పరిష్కారం లభించనుంది. కావున వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలోని రాయపర్తి, మైలారం, వర్ధన్నపేట సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వాడుకోవాలని కోరారు. సమస్యలు ఉన్నవారు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందజేసి, ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ నటరాజ్ విజ్ఞప్తి చేశారు.

